క్లుప్తంగా

పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ



పాఠశాలలో మొక్కలు నాటుతున్న చిన్నారులు

దెందులూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సీతంపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జి.సునీత అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, తోట ఎడ్వర్డ్, తల్లిదండ్రులు, విద్యార్థులు, యాడాప్ హెల్దీ లైఫ్ స్టైలీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ మానవ మనుగడపై ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఎడ్వర్డ్ సుదీర్ఘంగా అవగాహన కల్పించారు.

జల్లికొమ్మర విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం : జాతీయ స్థాయిలో చిన్న స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు రాణించడం అరుదైన విజయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం జల్లికొమ్మర యూపీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో జాతీయ ప్రతిభ ఉపకార వేతనానికి (ఎన్ఎంఎంఎస్) ఎంపికైన విద్యార్థులు కవల రిషిత, బోడపాటి హరితరమ్య, మద్దాల శరణ్ సంధ్య, తిరువోలు శ్రీహరి, నిమ్మ బాలాజీ శ్రీమణికంఠ, మద్దాల లీలా వర్షితలను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ధర్మరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను గ్రామపెద్దలు, అధికారులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఖురెళ్ల వెంకట రత్నం, ఎంపీటీసీ ఎం వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు కవల కోదండరాంబాబు, మద్దాల మహంకాళి, మండల నాయకులు తోట శ్రీను, ఎంఈఓలు శేషు, బాలయ్య, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులున్నారు.

ప్రవీణ్‌కు నివాళి



ప్రవీణ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొఠారు, నాయకులు

పెదవేగి : చేతికి అందివచ్చిన కుమారుడు అకాల మరణం పొందడం తీర్చలేని లోటని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు అన్నారు. ఇటీవల మరణించిన పెదవేగి మండలం సూర్యారావుపేట గ్రామానికి చెందిన యలమంచి ప్రవీణ్ సంతాప సభ ఆయన స్వగృహంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కొఠారు ప్రవీణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వృద్ధుల సమస్యలపై వినతి



జేసీ లావణ్య వేణికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): వృద్ధుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీనియర్ సిటిజన్స్ యూనియన్ ఏలూరు నగర నాయకులు శనివారం ఏలూరు కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో జేసీ బి.లావణ్యవేణికి వినతి పత్రం అందజేశారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎన్‌వీవీఎస్ ప్రసాద్ మాట్లాడారు. వృద్ధుల పోషణ, ఆస్తి, ప్రాణ రక్షణకు కేంద్ర ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం చేసిందన్నారు. ఈ చట్టానికి సంబంధించి నిబంధనలు రూపొందించి రాష్ట్రాల్లో అమలు చేయాలని 2011లో ఉత్తర్వులిచ్చిందని తెలిపారు. నేటికీ అవి పటిష్టంగా అమలు కావడంలేదని, వృద్ధుల, ఆస్తి, ప్రాణ రక్షణకు భరోసా కల్పించే విధంగా జిల్లాలో ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ట్రిబ్యునల్ తీర్పులను సకాలంలో ఇచ్చి, పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఒక హెడ్ కానిస్టేబుల్‌ను నియమించి వృద్ధుల సమస్యలపై స్పందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రెవెన్యూ డివిజన్ పరిధిలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఆధ్వర్యంలో నెలకు ఒక రోజు వృద్ధుల పెండింగ్ సమస్యలపై సమీక్షించి, చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. జాతీయ విధానాన్ని అనుసరించి ఏర్పాటుచేసిన వృద్ధుల రైల్వే రాయితీని పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు వడ్లపట్ల నారాయణరావు, నాయకులు ఆర్ఎస్‌వీ ప్రసాదరావు, అడుసుమిల్లి సత్యనారాయణ, దయానంద బుద్ధ, రామస్వామి, సాగర్ తదితరులు ఉన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రతి శని, ఆదివారాల్లో ఉచితంగా టీకాలు
- ప్రభుత్వాసుపత్రుల్లో సరిపడా నిల్వలు



గణపవరంలో చిన్నారులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో ఆయా టీకాలు, వ్యాక్సిన్‌లు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితం గడప వచ్చు. ఐతే చాలా మంది, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లూ వళ్లూ గుల్ల చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలూ కోల్పోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధినిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్‌లు వేసేది ఇలా:

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు నిండిన తర్వాత టీటీ ఇంజక్షన్ వేయాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్స్ ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోసు వేయాలి. వీటివల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- ఆరు, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు ఆరు, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఎ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్–ఎ ఓపీని వేయించాలి.
- ఐదేళ్ల పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి.
- 10, 16 సంవత్సరాలు పూర్తైతే టెట్నాస్ (టీటీ) వేయించాలి.
- తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్–ఎ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.



టీకాలు వేయించాల్సిన కాల పట్టిక

టీకాలు తప్పనిసరి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈటీకాలపై తమ సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

– పులపర్తి సంతోష్, పీహెచ్‌సీ వైద్యాధికారి, గణపవరం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదపాడు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్హులందరికీ పింఛన్లు అందించాలన్నారు. నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ గారపాటి రామసీత, మాజీ ఎంపీపీ మోరు శ్రావణి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

దెందులూరు: పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో పర్యావరణం పరిరక్షణపై 9, 10 తరగతి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వీరిలో 10వ తరగతి విద్యార్థి పి.ఉదయ్‌కిరణ్ వేసిన పర్యావరణాన్ని కాపాడేందుకు, కాలుష్యాన్ని నివారిద్దాం చిత్రం ప్రథమ, బి.హర్షవర్ధన్ వేసిన చెట్లను కాపాడండి – భూమిని రక్షించండి చిత్రానికి ద్వితీయ, రాజ సత్యశ్రీ వేసిన సేవ్ వాటర్ చిత్రానికి మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, గ్రామ దీప్ ముఖ్య ప్రోత్సాహకురాలు వెలమాటి మనోహరి, ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

మతసామరస్యాన్ని కాపాడాలి

డీఎస్పీ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవికుమార్

భీమడోలు: మత సామరస్యాన్ని పాటిస్తూ బక్రీదు పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు అన్నారు. భీమడోలు పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఈనెల 17న బక్రీద్ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. గో సంరక్షణ చట్టం అమలు తదితర అంశాలపై చర్చించారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం గోవధను పూర్తిగా నిషేధించిందని, పోలీసులకు సహకరించాలని కోరారు. గో సంరక్షణ చట్టం 2017ను అతిక్రమిస్తే కఠిన శిక్ష తప్పదన్నారు. గ్రామాల్లో ముస్లింలు మనస్పర్థలుంటే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. మత సామరస్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా బక్రీద్‌ను నిర్వహించుకోవాలన్నారు. సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో భీమడోలు, ద్వారకా తిరుమల మండలాల్లో ముస్లింలంతా భక్తి భావంతో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

గణపవరం: బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై వేముల వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం సాయంత్రం గణపవరంలో ముస్లింలు, సంఘ పెద్దలతో వారు సమావేశం నిర్వహించారు. వివాదాలు వంటివి ఉంటే సంఘ పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని, గోవధ లాంటివి లేకుండా చూడాలని సూచించారు.

బక్రీద్ శుభాకాంక్షలు

ఉంగుటూరు: ముస్లింలు కలిసిమెలిసి బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలని సీఐ సుబాష్ సూచించారు. శనివారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ముస్లింలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్సై మణికుమార్ మాట్లాడారు.

ముస్లిం పెద్దలతో సమావేశం

దెందులూరు: బక్రీద్ పండుగను ఇతర మతాలకు ఇబ్బందులు లేకుండా ప్రార్థనలు నిర్వహించుకోవాలని ఎస్సై కె.స్వామి కోరారు. శనివారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముస్లిం పెద్దలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. మత పెద్దలకు బక్రీద్ శుభాకాంక్షలను తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ హమీద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



కొవ్వలిలో విద్యార్థులకు ఆర్థికసాయం అందించిన ట్రస్టు సభ్యులు

దెందులూరు: మండలంలోని కొవ్వలి హైస్కూల్లో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వడ్లపట్ల కస్తూరిమాత మెమోరియల్ ట్రస్టు (అమెరికా) చైర్మన్ వడ్లపట్ల సత్యనారాయణ కుమారుడు రామ్‌చంద్ శనివారం ఆర్థిక సాయం అందజేశారని హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా టెన్త్‌లో ఎక్కువ మార్కులు సాధించిన ఆర్తల తనూశ్రీకు రూ.8 వేలు, నక్కా హర్షగోపాల్‌కు రూ.6 వేలు, కంచన పార్వతి ప్రియాంకకు రూ.3 వేలు, వేమూరి వీరవాణికి రూ.3 వేలు రాచూరు హైస్కూల్ హెచ్ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్ చేతులు మీదుగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉప్పులపాటి మణిమల్లికకు రూ.5 వేలు, ముసునూరి బాల త్రిపురసుందరికి రూ.5 వేలు, బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న రేఖారవళికి రూ.25 వేలు నగదు పురస్కారాన్ని అందించారని తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



నేను బడిపోతా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో శనివారం పాఠ్య, నోటు పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎంఈఓ–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన పంపిణీ చేశారు. నేను బడికి పోతా అనే కార్యక్రమానికి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఆహ్మద్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఎంపీటీసీలు ప్రత్తి భానులక్ష్మీ, ముళ్లగిరి జాన్సన్, ఆల్తి గోపి, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నెహ్రూనగర్ నగర్‌లో మురుగు కాలువ పూడిక తీత పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

ఉంగుటూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపవిద్యా శాఖాధికారి రవీంద్రబారతి అధ్యక్షతన విద్యార్థులకు పుస్తకాల కిట్లను ఎమ్మెల్యే ధర్మరాజు అందజేశారు. టెన్త్ టాపర్ కై కరం విద్యార్థిని శానం నందిని ప్రియ, సైన్స్ ఫెయిర్‌లో రాణిస్తున్న నెరుసు కుసుమలతను ఎమ్మెల్యే అభినందించారు. సర్పంచ్ బండారు సింధు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, తెలుగు యువత, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

గణపవరం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ కె.రాంబాబు, ఎంఈఓలు పి.శేషు, జి.బాలయ్య, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

నిడమర్రు: స్థానిక జెడ్పీస్కూల్లో మండలంలోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ ఎమ్మెల్యే ధర్మరాజు పంపిణీ చేశారు. పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఎంఈఓ పుచ్చల శేషు, సర్పంచ్ ఉమ మహేశ్వరరావు, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, నాయకులు దొరబాబు, ఇంటి ఉదయ భాస్కర్ తదితరులున్నారు.

శునకాలతో బెంబేలు





గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న శునకాలు

పెదవేగి : దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శునకాల బెడద అధికంగా ఉంది. ఇవి రోడ్లపై తిష్టవేసి దారినపోయేవారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల కుక్కలు 12 మందిని గాయపర్చాయని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలకు నిత్యం మూడు, నుంచి ఐదు వరకు కుక్క కాటు కేసులు వస్తున్నారని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు చెబుతున్నారు. పెదవేగి మండలం వేగివాడ, కొప్పాక, పెదవేగి రాట్నాలకుంట, దిబ్బగూడెం, పెదపాడు మండలం వట్లూరు, పెదపాడు, నాయుడుగూడెం, వసంతవాడ, ఏలూరు మండలం హనుమాన్ నగర్, వంగాయిగూడెం, చాటపర్రు, దెందులూరు మండలం కొవ్వలి, పోతునూరు, దెందులూరు, రామారావుగూడెం, చల్లచింతలపూడి, శ్రీరామవరం, పిచ్చికుక్కల బెడద అధికంగా ఉంది.

పశువులపైనా దాడి

గ్రామాల్లో స్వైరవిహారం చేస్తోన్న కుక్కలు పశువులపైనా దాడి చేస్తున్నాయి. కుక్కల బారిన గేదెలు, కోళ్లు, పావురాళ్లు, పెంపుడు జంతువులపై కుక్కలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. మండల ఉన్నతాధికారులు స్పందించి కుక్కల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నరకం చూస్తున్నాం



గ్రామాల్లో కుక్కలు నిత్యం సంచరిస్తూ.. రోడ్లపై ప్రయాణించే ప్రజలను గాయపరుస్తున్నాయి. ఆసుపత్రి పాలు చేస్తున్నాయి. అధికారులు, నాయకులు చొరవ తీసుకుని పిచ్చికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

చోడిశెట్టి వెంకన్న దిబ్బగూడెం గ్రామస్తుడు

పట్టించుకునేవారేరీ



గ్రామ సమీపంలో రాట్నాలమ్మ తల్లి దేవస్థానం ఉండటంతో అక్కడి అమ్మవారికి బలి ఇచ్చే జంతువుల రక్తం కోసం చుట్టుపక్కల ఊళ్ల నుంచి భారీగా కుక్కలు తరలివస్తాయి. జంతు మాంసం తింటున్న కుక్కలు మనుషులపైనా దాడి చేస్తున్నాయి.

– పొన్నూరి శంకర్‌గౌడ్, పెదవేగి గ్రామస్తుడు

చర్యలు చేపడతాం



మండలంలో పిచ్చికుక్కల బెడద తీవ్రత గూర్చి పలువురు గ్రామ స్థాయి నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతాం.

– బి.శ్రీనివాస్, ఈవోఆర్డీ, పెదవేగి

తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర వేసిన శ్రీశ్రీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : మహాకవి శ్రీశ్రీ తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర వేశారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవన్లో ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశ్రీ 42వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలుస్తోందంటూ ప్రజలను భవిష్యత్ వైపు పరుగులు పెట్టించారన్నారు. తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు, ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అది మోసిన బోయీలెవ్వరు అంటూ శ్రామికుల పక్షాన తన కవితలను రచించారని తెలిపారు. తొలుత మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు శ్రీహరి కోటి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మైలవరపు గురు శర్మ, ఎస్ కస్తూరి రావు, హరికోటి శ్యామల, ఎంఎస్ఎన్ లక్ష్మి, డి.గణేష్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పర్యవేక్షించారు.

మట్టి అక్రమ తవ్వకాల నిలిపివేత



బాపిరాజుగూడెం పెద్ద చెరువులో మట్టి తవ్వకాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

18 ట్రాక్టర్‌లు, 1 పొక్లెయిన్ సీజ్

పెదవేగి : పెదవేగి మండలం బాపిరాజుగూడెం గ్రామంలోని ఇరిగేషన్‌కు చెందిన పెద్ద చెరువులో ఒక ప్రొక్లెయిన్, 18 ట్రాక్టర్‌లతో మట్టి అక్రమ తవ్వకాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులను డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామంలో తనిఖీ చేశారు. మట్టి త్వకాలకు అనుమతులు లేవని నిర్ధారించిన డీటీ, వీఆర్ఓ మురళీరాజు, వీఆర్ఏ వేల్పుల నాగయ్యలు బొప్పన సీతారాం బాబుకు చెందిన పొక్లెయిన్‌ను, మరో 18 ట్రాక్టర్లను సీజ్ చేశారు. పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేయడం చేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పిల్లలు బడిలోనే ఉండాలి



పెదపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెదపాడు : బడి వయసు ఉన్న పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలలో విద్యాభ్యాసం చేయాలని ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీరమణ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో నేను బడికి పోతా అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థుల హాజరు పెంపు, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండటం, నూతన విద్యార్థుల సామర్థ్యాల మదింపు, బడిలో చేరే విద్యార్థుల వయస్సు ఆధారంగా వారి సామర్థ్యాలను పెంపొందించే విధంగా బ్రిడ్జి కోర్సుల నిర్వహణ, డ్రాప్ అవుట్స్ తగ్గించడం వంటివి నిర్వహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.